క్లుప్తంగా

పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవారికి ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు



మాచర్ల రూరల్: గ్రామ ప్రజలంతా ఐక్యంగా పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవారి దేవాలయం నిర్మించుకుని వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఐక్యతకు, శాంతి సౌభాగ్యాలకు నెలవు అని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పోలేరమ్మ చౌడేశ్వరి అమ్మవారి దేవాలయ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం గ్రామ ప్రజల ఐక్యతతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండి రైతన్నల కుటుంబాలంతా సుఖశాంతులతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ తేళ్లూరి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరికట్ల పున్నారెడ్డి, గాలి బాలిరెడ్డి, దగ్గుల లచ్చిరెడ్డి, జయభారత్‌రెడ్డి, హనిమిరెడ్డి, కొండలు, అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కోటిరెడ్డి, దగ్గుల లక్ష్మారెడ్డిలున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని వచ్చే నెల 9వ తేదీన నిర్వహించటం జరుగుతుందని లోక్ అదాలత్ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం. గంగాధర్‌రావు తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, చెక్‌బౌన్స్ కేసులు, సివిల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు ఆయన తెలియజేశారు. కావున పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



రెంటచింతల: స్థానిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక బీసీ బాల, బాలికల సంక్షేమ వసతి గృహాల్లో సలహా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థిని పట్టుదల, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఆ విద్యార్థిని ఉన్నతస్థానానికి చేరుకుంటారన్నారు. కష్టపడి అత్యున్నతస్థాయికి చేరుకున్న మహనీయుల జీవిత చరిత్రలను చదివి వారి అడుగుజాడల్లో నడిచి మీ కన్న తల్లి దండ్రులకు, మీరు చదువుకున్న పాఠశాలలకు, మీ గ్రామాలకు గుర్తింపు తీసుకురాలని అప్పుడే మీ జీవితం సార్థకమౌతుందన్నారు. తరగతి గదులలో ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను ప్రతి రోజు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంక్షేమ వసతి గృహాల వేల్ఫేయర్ ఆఫీసర్లు బి.శారదారవి కుమారి, జె.గంగాధర్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వ్యక్తిపై బీరు సీసాతో దాడి

నరసరావుపేట టౌన్: వ్యక్తిపై బీరు సీసాతో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. మిట్ట బజారుకు చెందిన నీలం చక్రపాణి మద్యం సేవించేందుకు అరండల్‌పేటలోని ఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం సేవించి ఉన్న నక్కా గోపితో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చక్రపాణిపై గోపి బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

కొప్పుకొండ భూములపై విచారణ

నూజెండ్ల: వినుకొండ రూరల్ మండలం కొప్పుకొండ గ్రామ పంచాయతీ పరిధిలో 120 ఎకరాల చెరువు పోరంబోకు భూములపై మంగళవారం ఆర్డీవో శేషురెడ్డి, తహసీల్దారు కిరణ్ కుమార్‌లతోపాటు, సర్వేయర్లు విచారణ చేపట్టారు. సర్వే నంబరు 281/10 బీ, 289లో గల భూములను గత టీడీపీ ప్రభుత్వంలో అక్రమ చేపల చెరువు ఏర్పాటు చేశారు. అయితే ఆ భూములను ప్రభుత్వం గతంలో స్వాధీనం చేసుకుంది. కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆర్డీవో శేషురెడ్డి తెలిపారు.

గొడవల నుంచి ఆధ్యాత్మికంవైపు

- ఆలయాలు నిర్మించారు.. ఫ్యాక్షన్‌ను పారద్రోలారు
- రూ. 85 లక్షల వ్యయంతో ఆలయాల నిర్మాణం పూర్తి
- జంగమహేశ్వరపాడులో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక శోభ



పోలేరమ్మ, ఆంజనేయ స్వామి దేవాలయాలు

దుర్గి: చుట్టూ కొండలు, అటవీ ప్రాంతానికి దగ్గరలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిలయమైన ఆ గ్రామానికి ఫ్యాక్షన్ రక్కసి కారణంగా చిన్నబోయింది. అది గతం.. నేడు పగలు ప్రతీకారాలు విడనాడి పలుగూ పారలు చేతపట్టి వ్యవసాయం చేసి అత్యధిక దిగుబడులు సాధిస్తూ గ్రామంలో ఆధ్యాత్మికత వైపు పయనిస్తున్నారు. పిల్లలను పెద్ద చదువులకు పట్టణాలకు పంపిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది రోజులకే వారి హయాంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల వ్యక్తుల మధ్య చిన్నపాటి వివాదాన్ని తెదేపా నాయకులు పెద్దది చేసి ఒక వర్గానికి కొమ్ముకాస్తూ వైఎస్సార్ సీపీ నేతను హత్య చేసిన ఘటన గ్రామస్తులను కలచి వేసింది. ఈ ఘటనను సాకుగా చూపి తెదేపా నేత చంద్రబాబునాయుడు, లోకేష్ ప్రతీ బహిరంగ సభలలో అరాచకాలకు అడ్డాగా మాచర్ల నియోజక వర్గంతో పాటు పదే పదే జంగమహేశ్వరపాడు గ్రామాన్ని ఫ్యాక్షన్ గ్రామంగా చిత్రీకరించడం గ్రామస్తులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. ఈ చర్యతో గ్రామస్తులు తమ గ్రామంలో ఆలయాలను నిర్మించి తమ గ్రామానికి ఈ ఫ్యాక్షన్ ముద్రను చెరిపివేసేందుకు అడుగులు వేస్తున్నారు. దానిలో భాగంగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల సహాయ సహకారాలతో గ్రామాభివృద్ధితో పాటు రూ. 85 లక్షల వ్యయంతో శ్రీగంగమ్మతల్లి, గ్రామ దేవత పోలేరమ్మ, పోతురాజు, శ్రీ ఆంజనేయ స్వామిల ఆలయాలను నిర్మించారు. గత సంవత్సరం శ్రీ గంగమ్మ తల్లి ఆలయాన్ని వైభవోపేతంగా ప్రతిష్ఠించి ఆ ఒరవడిని కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2వ తేదీ శనివారం వరకు శాస్త్రోక్తంగా శ్రీ మహా శీతలి, నాభిశిల (బొడ్రాయి), గమిడి శీతలి యంత్రములు, నూతనంగా నిర్మించిన గ్రామ దేవత పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి వారి జీవ ధ్వజస్తంభ మహా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరు కానున్నట్లు ఆలయ ప్రతిష్ఠ కార్యవర్గ సభ్యులు ఊరిబిండి మన్నయ్య తెలిపారు.

గ్రామస్తుల ఐకమత్యంతోనే సాధ్యం



గతంలో మా గ్రామంలో గొడవలు కారణంగా చాలా కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పీఆర్కే, పీవీఆర్‌ల సూచనలు, సలహాల మేరకు మా గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంగా ఉండి ఆలయాలు నిర్మించుకున్నాము. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నాము.

– ఊరిబిండి అంజయ్య, సర్పంచ్

ఈ ఘనత ప్రభుత్వ విప్ పీఆర్కేదే



మా గ్రామంలో ఎన్నడూ లేని విధంగా గ్రామస్తులంతా ఐకమత్యంగా ఆలయాలు నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ముమ్ముందు పండుగలు, తిరునాళ్ళు శాంతియుతంగా జరుపుకోవడానికి అందరూ కలిసి ముందుకురావాలని కోరుతున్నాను. శాంతియుత వాతావరణాన్ని కల్పించిన ఘనత ప్రభుత్వ విప్ పీఆర్కేకే దక్కుతుందన్నారు.

– గాజుల వీరాంజి, గ్రామస్తుడు.

ఘనంగా వెంకటరామిరెడ్డి జన్మదినోత్సవం



వెంకటరామిరెడ్డికి క్రేన్‌తో భారీ పూలమాల వేస్తున్న మేకల శ్రీనివాసరెడ్డి, చిరుమామిళ్ల శ్రీకాంత్



వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేస్తున్న పీవీఆర్

కారెంపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోన్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (పీవీఆర్) జన్మదినోత్సవ వేడుకలు కారెంపూడి మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, మండల యువజన విభాగం నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్ తదితరులు వెంకటరామిరెడ్డికి క్రేన్‌తో భారీ పూల మాలను వేశారు. అలాగే భారీ కేక్‌ను పీవీఆర్‌తో కట్ చేయించి వేడుక నిర్వహించారు. శ్రీకాంత్ స్వగ్రామమైన ఒప్పిచర్ల గ్రామంలో గ్రామ పార్టీ పెద్దలతో కలిసి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళ సంప్రదాయ మంగళవాయిద్యాల నడుమ భారీ కేక కట్ చేసి పీవీఆర్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే కారెంపూడిలోని బొమ్మిన హనుమయ్య పురవేదికపై మండల, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో పీవీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పులిహోర పంపిణీ చేసి వేడుక జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తండా జావీద్, షేక్ చోటా కరీమ్, మస్తాన్ మిత్ర మండలి పీవీఆర్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ షేక్ షఫీ, పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ షేక్ అక్బర్, గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, పాతూరి రామిరెడ్డి, కొమెర పిచ్చెయ్య, చింతల శ్రీను, ఆర్యవైశ్య యువ నాయకులు, అలాగే వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాచర్ల తరలివెళ్లి వెంకటరామిరెడ్డికి పూలమాలలు వేసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

దుర్గిలో...

దుర్గి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి జన్మదిన వేడుకలు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఊరిబండి యోగయ్య నేతృత్వంలో బైకు ర్యాలీ నిర్వహించి పీవీఆర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి పంపిణీ చేశారు. పివిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, సొసైటీ ఛైర్మన్ కటకం రామారావు, ఏఎంసి ఛైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, వైఎస్సార్ సీపీ నాయకులు కటకం చిన వెంకటయ్య, ఉన్నం పెద్దబ్బాయ్, యకటీల బుచ్చిబాబు, ఊరిబండి మన్నయ్య, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, చింతా రామకృష్ణ, శెట్టిపల్లి కోటేశ్వరరావు, మాదాసు వాసు, బొంతా కృష్ణ, కొల్లి హనుమయ్య, జక్కా బాజి యాదవ్, వైస్ ఎంపీపీలు చల్లా శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, చిన్నబ్బాయ్, రాయల మధు తదితరులున్నారు.

మాచర్ల రూరల్‌లో...

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని రాయవరం, కంభంపాడు, కొత్తపల్లి, గన్నవరం, జమ్మలమడక, తాళ్లపల్లి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు జన్మదిన కేక్‌లు కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, చిలమకూరి వెంకటేశ్వరరెడ్డి, పెనుపాటి సుందరలీల, ఎం రాజేష్, పెండ్లి రామసుబ్బారావు, లక్ష్మారెడ్డి, నాగెండ్ల బాబు, ఆరికట్ల చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పేర్ల మల్లయ్య, ముక్కా గురవయ్య, వెంకట్రామయ్య, తీర్థాల కొండలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి వుండాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాష

గురజాల : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాష అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా జడ్జి జి వెంకటేశ్వర్లు సూచనల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్, ప్రొటెక్షన్ – 2015, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. బాల కార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కలివెల ప్రభుదాసు, ఉప విద్యాశాఖాదికారి సాంబశివరావు తదితరులున్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈటీలను సన్మానిస్తున్న హెచ్‌ఎం విజయకుమారి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ కె.వి. మహేష్

మాచర్ల రూరల్: విద్యార్థుల్లో మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, అలాంటి క్రీడల్లో శిక్షణ అందించడంలో పీఈటీ ఉపాధ్యాయుల కృషి అమూల్యమైనదని హెచ్‌ఎం రామిరెడ్డి విజయకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో జాతీయ క్రీడా, తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. విద్యార్థుల చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్న సీఎం జగన్ కృషి అమూల్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వృక్షత్వం, క్విజ్, ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ జబ్బార్, పీఈటీ గొట్టిపాటి కర్తయ్య, నరసింహారావు, తెడ్లా మురళి తదితరులున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

నరసరావుపేట రూరల్: క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ కె.వి.మహేష్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతాయని, దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఎవరిమీద ఆధార పడకూడదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణమైన విద్యార్థి చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో నైపుణ్యాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు డీఎస్పీ మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, కళాశాల స్పోర్ట్స్ కన్వీనర్ ఎల్.కృష్ణారెడ్డి, ఝాన్సీ రాణి, ఐ.శ్రీధర్ పాల్గొన్నారు.

హంస పురస్కారాన్ని అందుకున్న పిడుగురాళ్ల కవి



హంస పురస్కారాన్ని అందుకున్న కవి వైహెచ్‌కే మోహన్‌రావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కవి వైహెచ్‌కే మోహన్‌రావుకు హంస పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కవి వైహెచ్‌కే మోహన్‌రావు మాట్లాడుతూ రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో తెలుగు, సంస్కృత అకాడమి వారి హంస పురస్కారానికి తనను సాహిత్య రంగంలో ఎంపిక చేసినట్లు తెలిపారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్, తెలుగు అకాడమి చైర్మన్ లక్ష్మీ పార్వతీల చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని ఆయన తెలియజేశారు. పురస్కారాన్ని అందుకున్న వైహెచ్‌కే మోహన్‌రావును పుర ప్రముఖులు అభినందించారు.

నేడు, రేపు తంగెడలో గడప గడపకు మన ప్రభుత్వం

దాచేపల్లి : మండలంలోని తంగెడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ మంగళవారం తెలిపారు. రెండు రోజుల పాటు ఎమ్మెల్యే కాసు గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడతారని, ప్రభుత్వ అధికారులతో పాటుగా నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భూముల రీ సర్వే

బొల్లాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వే మండలంలోని పేరూరుపాడు, బొల్లాపల్లి, వడ్డెంగుంట, కనుమలచెరువు, గుట్లపల్లి రెవెన్యూ గ్రామాల్లో కొనసాగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ తెలిపారు. త్వరలో రోవర్స్ యంత్ర పరికరాల ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఈ సర్వేలో భూ కొలతలు నిక్కచ్చిగా నిర్వహణ ఉంటుందని తెలిపారు. రీసర్వే పూర్తయిన అనంతరం హద్దురాళ్లు ఏర్పాటు చేయడం, రైతులకు భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

ఓటర్ల పరిశీలన నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నాం

ఆర్‌డీఓ అద్దెయ్య




వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ అద్దెయ్య

పిడుగురాళ్ల: ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిష్పక్షపాతంగా నిర్వహించడం జరుగుతుందని గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గురజాల నియోజకవర్గ స్థాయి ఓటర్ల పరిశీలన, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటర్ల జాబితాలో ఉన్న సమస్యలను పలు పార్టీల నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ఉన్న సమస్యలను లేవనెత్తారు. దాచేపల్లి టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఇక ఇంట్లో ఉన్న ఓటు రెండు మూడు బూత్‌లలో నమోదు అయిందని అటువంటి వాటిని తొలగించాలని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. అందుకు ఆర్‌డీఓ మాట్లాడుతూ ఆ జాబిత తమ కార్యాలయం చేరిందని సర్వర్ ప్రాబ్లం వల్ల జాప్యం జరిగిందని వచ్చే సోమవారానికల్లా జాబితా సిద్ధం చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ఓటరు నమోదుకు ఆధార్‌కార్డు అనుసంధానమై ఉన్నందున ఆధార్ కార్డు నంబర్ నమోదు చేస్తే ఒక వ్యక్తికి ఎన్ని ఓట్లు ఎక్కడెక్కడ ఉన్నాయి అని సమాచారం తెలుస్తోందని, అప్పుడు ఆ వ్యక్తికి ఎక్కడో ఒక చోట మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కలుఉతుందని ఈ పద్ధతిని అన్ని పార్టీల నాయకులు ముందుకు రావాలని సూచించారు. దీనికి టీడీపీ నాయకులు మాత్రం తమకు అనుమానం ఉన్న చోట మాత్రమే సమస్య పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకొస్తాం కానీ అన్ని చోట్ల ఆధార్ అనుసంధానం అవసరం లేదని తప్పించుకున్నారు. పలు పార్టీల నాయకులు మాత్రం ఒక వ్యక్తి ఒక చోట మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మాచవరం, దాచేపల్లి, గురజాల తహశీల్దార్‌లు, గురజాల, దాచేపల్లి మున్సిపల్ కమిషనర్లతో 'గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరుల వైఎస్సార్ సీపీ నాయకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గిడుగు వారి జయంతోత్సవం



దాచేపల్లి హైస్కూల్‌లో మాతృభాష దినోత్సవం జరుపుతున్న దృశ్యం



వివిధ వేషధారణలో విద్యార్థులు

కారెంపూడి: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 161వ జయంతోత్సవం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ రవికుమార్ తదితరులు వెంకట రామమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి వెంకట రామమూర్తి అందించిన ఎనలేని సేవలను ఎంఈఓ రవికుమార్ ఈ సందర్భంగా కొనియాడారు. వ్యవహారిక తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయడంలో గిడుగు వారు అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఆనంద లహరి నిర్వాహకుడు శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు భాషని కాపాడుకుందాం

దాచేపల్లి : తెలుగు భాషని కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు అన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జరుపుకున్నారు. విద్యార్థులు పలు రకాల వేషలుధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహనీయుల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళి అర్పించారు. తెలుగు భాషలో తీయ్యదనం, కమ్మదనం ఉందని, మాతృభాషను మర్చిపోవద్దని శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నం, జానయ్య, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, జానీభాషా పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

కారెంపూడి: తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు స్రవంతి, గంజానాయక్, వంశీకుమార్‌లు విద్యార్థులకు వ్యాసరచన, కథలు, పద్య పఠన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపల్ నయోమి చేతులు మీదగా బహుమతులను ప్రదానం చేశారు. గిడుగు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. గిడుగు వెంకటరామమూర్తి గొప్పదనాన్ని ఆయన మాతృభాషకు చేసిన సేవలను విద్యార్థులకు వారు వివరించారు.

పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవారికి వెండి కిరీటం, వడ్డాణం అందజేస్తున్న దాతలు

మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పోలేరమ్మ, చౌడేశ్వరి అమ్మవారికి లక్ష విలువైన వెండి కిరీటం, వడ్డాణం న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి పద్మావతిలు మంగళవారం అందజేశారు. దేవాలయ పూజారి ఇరువంటి సత్యనారాయణ శాస్త్రి, గిరిశర్మ, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా దేవాలయానికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, ఆరికట్ల పున్నారెడ్డి, గాలి బాలిరెడ్డి, దగ్గుల లచ్చిరెడ్డి, జయభారత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులున్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 31వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఆయన సూచించారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

నాదెండ్ల: తన సోదరుడు, మేనమామపై దాడి చేసిన చందవరం గ్రామానికి చెందిన వ్యక్తిని నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన గొంటు జయభరత్‌రెడ్డి తన ట్రాక్టర్‌తో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తన మేనమామ కృష్ణారెడ్డిని ఢీకొట్టాడు. అదేమని ప్రశ్నించిన గొంటు శ్రీనివాసరెడ్డిపై గొడ్డలితో దాడి చేశాడు. గొంటు శ్రీనివాసరెడ్డి, చేరెడ్డి కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం నిందితుడు జయభరత్‌రెడ్డిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచారు.

ఇరువురి మధ్య ఘర్షణ..ఒకరికి గాయాలు



తలకు గాయమైన విఘ్నేశ్వరరెడ్డి

గురజాల : ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన లాలు నాయక్ ఇంటిలో ఫంక్షన్ ఉండగా గురజాలకు వచ్చారు. పల్లెగుంత గ్రామానికి చెందిన స్వర్ణబాబు లాలు నాయక్‌ను ఏ ఊరి నుంచి వచ్చావు నీవు అని అడగ్గా అంబాపురం నుంచి వచ్చాము అని సమాధానం ఇచ్చినట్లు అంబాపురం గ్రామానికి చెందిన విఘ్నేశ్వరరెడ్డికి స్వర్ణబాబు ఫోన్ చేసి మీ ఊరు వారేనా అని అడిగారు. ఈ నేపథ్యంలో లాలు నాయక్, స్వర్ణబాబుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంటనే లాలు నాయక్ తన బంధువులతో అంబాపురం గ్రామంలోని విఘ్నేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరికి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో విఘ్నేశ్వరరెడ్డి తలకు తీవ్ర గాయం కాగా లాలు నాయక్ భార్య పార్వతిభాయ్ స్పృహ తప్పి కింద పడింది. వెంటనే విఘ్నేశ్వరరెడ్డిని, పార్వతి భాయ్‌లను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. విఘ్నేశ్వరరెడ్డి తలకు 6 కుట్లు పడ్డాయి. మెరుగైన వైద్యం కొరకు యిరువురికి గుంటూరు వైద్యశాలకు తరలించారు.